క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పూజలు నిర్వహించి, స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. స్వామి వారి కల్యాణంలో ఆలయ మేనేజర్ రమణ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం..

అశ్వాపురం: గ్రామీణ ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్ ద్వారా పండ్లతోటలు పెంపకం, బిందు సేద్యం పరికరాలకు ప్రభుత్వ ప్రోత్సాహం, రాయితీకి ఐదు ఎకరాల లోపు అనువైన భూమి కలిగి, జాబ్ కార్డు ఉన్న వారు ఈ నెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల లోపు అనువైన భూమి ఉండి, జాబ్‌కార్డు ఉన్న ప్రతి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు చిన్న, సన్న కారు రైతులు అర్హులన్నారు. ఈ నెల 31లోపు సమీప పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, ఏపీఓ, ఏఈఓ, ఏఓ, ఎంపీడీఓ, ఎంపీఓ తదితర అధికారులను సంప్రదించి పండ్ల తోటల పెంపకానికి రాయితీని పొందేందుకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు.

విజయవంతం చేయండి

కరకగూడెం: రేపు మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొనాలని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాల కల్లూరు లక్ష్మి, సవలం వీర్రాజులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం వితరణ అందజేశారు. 50 కేజీల బియ్యం, వంట సరుకులు, 9వేలు నగదును ఆ కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ వై.సూర్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు బి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ...అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుండు శరత్, ఫాస్ట్ ప్రెసిడెంట్ పి. దేసప్ప, బిల్లీ పెళ్లి రంగారెడ్డి, దొసపాటి రాము, పచ్చి పులుసు వెంకట సుబ్బారావు, సర్పంచి అశ్విని, స్థానిక పెద్దలు కారం పుల్లయ్య, సరియం ప్రసాద్ పాల్గొన్నారు.

నామా ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మొద్దులమాడ గిరిజన గ్రామంలో శనివారం నామా ముత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది 28 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు, ట్రస్టు బాధ్యులు బిర్రంవెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ఖమ్మం ఎంపీ నామా ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ పండా రాజు, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెచ్ ఈవో రాజు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

అశ్వాపురం: ఈ నెల 26న మణుగూరులో గుట్టమల్లారంలో హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మండల నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు శనివారం వేరు వేరు ప్రకటనల లో పిలుపునిచ్చారు. ఈ నెల 24న జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కోచైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిటి సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హాజరవుతారని మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

క్వార్టర్ల కేటాయింపులో నిర్లక్ష్యం

- ఖాళీగా సింగరేణి ఇళ్లు
- కేటాయింపునకు వేచి చూస్తున్న కార్మికులు
- పిల్లల స్కూళ్ల విషయంలో అయోమయం



మణుగూరు ఏరియాలోని సింగరేణి క్వార్టర్లు

మణుగూరురూరల్: మణుగూరు సింగరేణి ఏరియా ప్రాంతంలో అనేక క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. పీవీకాలనీ, బాంబేకాలనీ, సీటైప్ కాలనీ, సింగరేణి సూపర్‌బజార్ ప్రాంతాల్లో కార్మికుల కోసం నిర్మించిన అనేక క్వార్టర్లు ఖాళీగా ఉన్నా.. వాటిని అర్హులైన సింగరేణి కార్మికులకు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిని వ్యవహరిస్తున్నారు. కార్మికులు సింగరేణి అధికారులకు, తమకు క్వార్టర్స్ మంజూరు చేయాలని దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ అధికారులు నుంచి మాత్రం చలనం లేదు. కాలయాపన చేస్తూ వన్నారు. దూరప్రాంతాల నుంచి పలు విభాగాలపై బదిలీపై వచ్చిన వారికి సకాలంలో క్వార్టర్లు మంజూరు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి మణుగూరు సింగరేణి క్వార్టర్స్ ప్రాంతంలో నెలకొంది. ఉత్పత్తి, ఉత్పాదకతలలో ప్రథమ స్థానంలో ఉన్నామని ప్రకటించుకుంటున్న సింగరేణి యాజమాన్యం అందుకు కారకులైన కార్మికుల సమస్యలను తీర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని పలు కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

స్కూళ్ల విషయంలో ఇబ్బందులు..

మణుగూరు సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఉండడానికి సరైన క్వార్టర్లు లేక మణుగూరు ప్రాంతంలో అధిక అద్దెలకు ఉండలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్టర్స్ వస్తాయో రావో అన్న ఆలోచనలో కార్మికులు.. వారి పిల్లలను ఏ పాఠశాలకు పంపించాలో అర్థంకాని అయోమయపరిస్థితి వారి కుటుంబాల్లో నెలకొంది. కార్మికులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించడానికి ఇబ్బందిగా ఉందని, దానికి ప్రధాన కారణమని తమకు క్వార్టర్స్ మంజూరుకాకపోవడమేనని అధికారులకు పలు మార్లు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. క్వార్టర్స్ మంజూరు విషయంలో అధికారులు తమ నిర్లక్ష్య ధోరణిని వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మణుగూరు ఏరియా కార్మిక యూనియన్లు కోరుతున్నాయి.

క్వార్టర్లు కేటాయించాలి



మణుగూరు సింగరేణి ఏరియాలో ఖాళీగా క్వార్టర్లను అర్హులైన కార్మికులకు, బదిలీపై వచ్చిన కార్మికులకు వెంటనే కేటాయించాలి. అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి కార్మికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలి. సింగరేణి అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండే కార్మికులపై వివక్షత చూపరాదని అన్నారు.

– మధుసూదన్‌రెడ్డి, ప్రజాపంథా జిల్లా నాయకుడు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో పారిశుద్ధ్య పనులను శనివారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలో గోదావరి వరదలకు తోడు పంచాయతీ కార్మికుల సమ్మె మూలంగా పారిశుద్ధ్యం లోపించడంతో కలెక్టర్ ప్రియాంక అలా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులపై శుక్రవారం సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పని చేయని వారిని వదిలేసి తాత్కాలిక సిబ్బందితో పట్టణంలో యుద్ధ ప్రతిపాదికన పారిశుద్ధ్య పనులు చేయించాని, కార్మికులు అడ్డు వస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాని చెప్పారు. దీంతో తాత్కాలిక కార్మికులతో కలిసి సమ్మెను విరమించిన పంచాయితీ కార్మికులు సైతం.. విధులకు హాజరై పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు. పట్టణంలోని కాలనీల రోడ్ల నిండా పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. ప్రధాన రహదారులపై ఉన్న చెత్తను డోజర్లతో ఒకచోటుకు చేర్చి ట్రాక్టర్లలో డంప్ యార్డుకు తరలించారు. డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో తొలగించారు. పారిశుద్ధ్య పనులను డీపీఓ రమాకాంత్, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ.. వర్షాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో పట్టణ ప్రజల ఆరోగ్యాల దృష్ట్యా సమ్మెను విరమించినట్లు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కొత్తపేట కాలనీలో ఈ నెల 19న గద్దల రాధాకృష్ణ అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు పట్టణానికి చెందిన గద్దల రాధాకృష్ణ అనే వ్యక్తికి దుమ్ముగుడెంకు చెందిన సంధ్య అనే మహిళతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగిందని, భార్యభర్తల మధ్య ఇటీవల వచ్చిన మనస్పర్థల కారణంగా గడిచిన మూడు నెలలుగా వీరిద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. వృత్తి రిత్యా రాధాకృష్ణ ఆర్టీసీ బస్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి 10 గంటల సమయంలో విధులు ముగించుకుని పట్టణంలోని కొత్తపేట కాలనీలో నివాసం ఉండే తన బంధువుల ఇంటికి వెళ్తున్న సమయంలో సంధ్య తమ్ముడు ప్రశాంత్ మరో వ్యక్తితో కలిసి రాధాకృష్ణపై ఆరోపణలు మోపి ఇష్టం వచ్చినట్లు తిట్టారు. ఆపై దాడి చేశారు. గడిచిన రెండు రోజుల నుంచి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది, శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రశాంత్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



అశ్వారావుపేట: సంఘీభావం తెలుపుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య



బూర్గంపాడు: సమ్మె శిబిరం వద్ద బ్రహ్మచారి

దమ్మపేట: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిచకపోతే జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం అని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో 17వ రోజు కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతుగా ఏఐటీయూసీ జిల్లా ఆయన మాట్లాడారు. ఈ నెల 27న కొత్తగూడెంలో నిర్వహించే జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ, బసవయ్య, సహదేవుడు, నాగర్జున, అన్నవరం పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నోముల రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా పంచాయతీ కార్మికుల సంఘ అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన సీపీఐ ఆధ్వర్యంలో వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, కారం నరసింహారావు, మడకం ముత్తయ్య, రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి ఆరోపించారు. బూర్గంపాడులోని గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, బర్ల తిరుపతయ్య, యాకుబ్, చారి, సురేష్, యాకుబ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి సంఘీభావం..

అశ్వారావుపేట: సమ్మె నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరికల కోసం అశ్వారావుపేట వచ్చిన ఆయన రింగ్ సెంటర్‌లో నిరశన నిర్వహిస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంచాయతీ కార్మికుల వేతనాల పెంపు, రెగ్యులర్ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జారే ఆదినారాయణ, జూపల్లి రమేష్‌బాబు, అట్టం రమ్య తదితరులున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడారు. అర్జున్, కామేష్, శ్రీను, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: రాజ్యసభ సభ్యుడు, హెటిరో సంస్థ అధినేత డాక్టర్ బండి పార్థ సారధిరెడ్డి ఆధ్వర్యంలో వీకేడీవీఎస్ రాజు కళాశాలలో నిర్వహించనునట్లు ఆ కళాశాల వీ శేషుబాబు ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అర్హులైన నిరుద్యోగులకు హెటిరో సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు.

కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం ముష్టిబండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వెళ్లారు. పేకాట శిబరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,080 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

చండ్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, సొసైటీల డైరెక్టర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్ణయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అనుసరిస్తున్న వైఖరితోనే తాము పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. పోకలగూడెం, మంగయ్యబంజర్, వెంకటియాతండా, దామరచర్ల సర్పంచ్‌లు ఇస్లావత్ నిరోషా, గుగులోతు సునిత, గుగులోతు బాలాజీ, ఇరప లక్ష్మీపతి, వెంకటియాతండా ఉపసర్పంచ్ బానోత్ రాధ, గానుగపాడు సొసైటీ డైరెక్టర్లు పసుపులేటి వెంకటేశ్వర్లు, తీట్ల మార్తమ్మ, ఇస్లావత్ మోతి తదితరులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. వీరు అశ్వారావుపేటలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చర్ల మండలానికి చెందిన సుమారు 20కుటుంబాల వారు వివిధ పార్టీలను వీడి ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రతీ ఒక్క కార్యకర్తకు బీఆర్‌ఎస్ పార్టీ జెండా శ్రీరామరక్షలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, చర్ల మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సోయం రాజారావు, మండల ప్రచార కార్యదర్శి కోటేరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ తుర్రం రవికుమార్, నాయకులు సీతాపతి రాజు, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

దుమ్ముగూడెం: ప్రముఖ తెలంగాణ సాహితీ యోధుడు పద్య రచన కావ్య పితామహుడు దాశరథి కృష్ణమాచార్య 98వ జయంతిని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ సాంస్కృతిక కళాకారుల ప్రచార కార్యదర్శి పిలక నాగేందర్ రెడ్డి, నాయకులు కణితి రాముడు, ఎండి.జాని పాషా, కెల్లా శేఖర్, అల్లాడి వెంకటేష్, జిలకర గంగరాజు, ఆకుల అనిల్, దేగల రవి, జంగిటి రాము, పిడకలపలి శ్రీను, కాకర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు



కరకగూడెంలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కరకగూడెం: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మణుగూరు ఏడీఏ తాతారావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులూ లేకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసగించినా వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతేకాకుండా దుకాణాల్లోని విత్తన ప్యాకెట్లపై కంపెనీ పేరు, గడువు తేదీ, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులను పరిశీలించారు. వ్యాపారులు విక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఎట్టి పరిస్థితిలో రసీదులు లేకుండా ఎరువులు కొనకూడదని కోరారు. అలాగే రసీదుల్లో రాసిన ధరలే దుకాణాల్లోని ధరల పట్టికలో ఉండాలని చెప్పారు. దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే తమ దృష్టికి ఎవరైనా తేవొచ్చని అన్నారు. తనిఖీల్లో ఏఓ చటర్జీ ఏఈఓలు ప్రశాంత్,అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సీపీఎం నుంచి ముగ్గురి బహిష్కరణ

చర్ల: ఇంతకాలం సీపీఎం పార్టీలో ఉంటూ స్వార్థ ప్రజయోజనాల కోసం ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న ముగ్గురిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్ ప్రకటించారు. శనివారం చర్లలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని మోసం చేయడంతో పాటు అవకాశవాదులుగా వ్యవహరిస్తున్న కారణంగా చీమలమర్రి మురళీకృష్ణ, రామకృష్ణ, కొత్తపల్లి శివను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బోళ్ల వినోద్, బందెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేశా..

పార్టీకి ఏనాడూ ద్రోహం చేయకుండా సిద్ధాంతం కోసం నిబద్ధతతో పనిచేశానని సీపీఎం నాయకుడు చీమలమర్రి మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. కానీ ఇప్పుడు కొందరి విధానాలు నచ్చక సీపీఎం నుంచి వైదొలగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వచ్చే నెల 10న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షాన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

రెండు క్వింటాళ్ల బియ్యం వితరణ



వితరణ అందజేస్తున్న సింగరేణి ఆపరేటర్లు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ గనిలో పని చేస్తున్న ఆపరేటర్లు స్పెషల్ గ్రేడ్ పదోన్నతులు వచ్చిన సందర్భంగా అశ్వాపురం మండలంలోని ఆరీఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమానికి రెండు క్వింటాల బియ్యాన్ని శనివారం వితరణగా అందజేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి స్పెషల్ గ్రేడ్ ఆపరేటర్లు ఎస్‌డి.నాసర్‌పాషా, ఆకారపు సమీంద్రాచారి, వత్సవాయి కృష్ణంరాజు, కొండా యాకయ్య, కునుసోత్ బాబూలాల్, గోశిక కుమారస్వామి, సింగరేణి సేవా సమితి సభ్యులు మహి విజేందర్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షెహానాజ్, వృద్ధులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలి

దమ్మపేట: యాదవులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ భవనం మంజూరు చేయించాలని కోరుతూ ఆ సంఘ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. శనివారం మండల పరిధిలోని యాదవ సంఘం సభ్యులు, తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో యాదవ కులస్తులకు కమ్యూనిటీ భవనం మంజూరు చేయించాలని కోరారు. మండలంలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మూడో విడత కూడా ప్రారంభించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి, మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. జోనెబోయిన శ్రీనివాసరావు, వేణు, వెంకటేశ్వరరావు, రాజీవ్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దేశానికి సిగ్గుచేటు



కరకగూడెం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ యువత, నాయకులు



దుమ్ముగూడెం: ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

అశ్వారావుపేటరూరల్: మణిపూర్ ఘటన దేశానికే సిగ్గు చేటని, ప్రధాని మోడి అసమర్థతకు నిదర్శనమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ పాల్వంచ డివిజన్ నాయకుడు గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కంగాల కల్లయ్య, బాడిస లక్ష్మణ్‌రావు, వాసం బుచ్చిరాజు, గోగినపల్లి గంగ, కుంజా అర్జున్, కవిత, జోడె ముత్తమ్మ, సన్యాసి ముత్తమ్మ పాల్గొన్నారు.

దమ్మపేట: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, వారిపై లైంగిక దాడికి పాల్పడటం తీవ్ర అమానుష చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రగతి శీల మహిళ సంఘం డివిజన్ కార్యదర్శి తోడెం దుర్గమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో, మణిపూర్‌లో జరిగిన అల్లర్లలో ఆదివాసీ మహిళలపై జరిగిన దాడికి వ్యతిరేకంగా, ప్రగతి శీల మహిళ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆదివాసీలపై దాడికి నిరసనగా, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో లక్ష్మి, రాజమ్మ, నాగమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అతి కిరాతకంగా అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, నియోజవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అనవరపు సత్యనారాయణ, మర్మం చంద్రయ్య, కొండా శ్రీధర్, బి.రమేష్, కొర్స చిలకమ్మ, యలమంచి శ్రీనుబాబు, కోడలి లోకేష్ బాబు,మర్మం సమ్మక్క, బత్తుల వెంకటేశ్వర్లు, యసా నరేష్, నిమ్మల మధు, బొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానవీయ ఘటనలను అదుపుచేసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షుడు సీహెచ్ జాన్సన్ కోరారు. శనివారం సారపాకలో పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలకు నిరసనగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్‌మార్క్, టీవీఆర్ మోదీ, రాఘవులు, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాద ముసుగులో గిరిజన మహిళను సామూహిక అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో లక్ష్మీనగరంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, బిఆర్ఎస్ నాయకులు కణితి రాముడు, అధికార ప్రతినిధి జానీపాషా, టీడీపీ మండల అధ్యక్షుడు కొమరం దామోదర్, ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లారు, సీపీఐ నాయకులు అన్నెం రామిరెడ్డి, తాటిపూడి రమేష్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు సాయన్న, మహిళా నాయకులు వాగే రాజేశ్వరి, పోడియం వెంకట రమణ, యూత్ నాయకులు అల్లాడి వెంకటేష్, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మణిపూర్లో హింసకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు ఆదివాసీ నాయకులు, యువత డిమాండ్ చేశారు. బాధిత మహిళకు సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

భద్రాచలంటౌన్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెచ్చల కల్పన డిమాండ్ చేశారు. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీ సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా కార్యాలయంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఘటనకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహిస్తూ బాధ్యులను శిక్షించి ముఖ్యమంత్రి వెంటనే రాజీనామ చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో శారద, కుమారి, నాగరత్నం, రేవతి, చినతల్లి, జయమ్మ, శాంతక్క, రమ, షకిరా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.